# కరిగిన కలలు

జీవితం పెద్దవలయంలాంటిది ఈ వలయపరిధికి అంతు కనబడదు. జీవన పరిభ్రమణంలో మనం అనేక వ్యక్తులను వివిధ పరిస్థితుల్లో ఎదుర్కొంటాం! కాని ఈ వ్యక్తుల్లో ఎక్కువ మంది సముద్ర కెరటాల్లాంటి వాళ్ళే! మన జీవితపు ఒడ్డును తాకి మళ్ళీ లోపలికి వెళ్ళిపోతూవుంటారు. కాని కొందరు వ్యక్తులు మాత్రం సామాన్యులే అయినా హృదయంలో విశిష్టస్థానాన్ని ఆక్రమించుకొని గాఢముద్ర వేసుకొంటారు. అటువంటి వాళ్ళను మనోఫలకంనుండి చెరిపివేద్దామనుకున్నా సాధ్యంకాదు. ఈ రకం వ్యక్తుల్లో పార్వతి ఒకామె.

పార్వతిది వింత మనస్తత్వం! "ఆడవాళ్ళను అర్థం చేసుకోవటం చాలా కష్టం మధూ!" అనేది ఆమె. "అందులోనూ నిన్ను అర్థంచేసుకోవటం మరీ కష్టంలే!" అనుకొనే వాణ్ణి మనస్సులో. పార్వతిని నా జీవితంలో వింతపరిస్థితుల్లో కలుసుకొన్నాను. మొదలునుంచి చివరవరకూ పరికించినా ఫలానా రకం వ్యక్తి! అని స్పష్టీకరించలేకపోయాను. అది నా "అసమర్థత" అంటే ఒప్పుకోను. దానికి కారణం ఆమె మనస్సేమో! ఆమెను నిర్వచించటానికి చాలాకాలం యత్నించి కృతకృత్యుణ్ణి కాలేకపోయాను.

"పార్వతి చాలా నెమ్మదయిన మనిషి!"

కాదు!—అల్లరికి పెట్టింది పేరు! ఊహు! గంభీర ముద్రదాల్చిన సముద్రం!

అదీకాదు—గలగలా పారే సెలయేరు! ఇంకా... ఎత్తైయిన పర్వతాల నుంచి భీకరంగా ప్రళయవేగంతో దూకుతున్న మహాజలపాతం...!

ఇవేమీ కాదేమో...!

ఆమె తత్వం ఇతమిత్థమని తేల్చి చెప్పలేకపోయాను. అసలు పార్వతిని గురించి వ్రాయలంటే చాలా వుంది.

* * * *

పార్వతి నావలెనే మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది. పుట్టిన కొద్దిరోజులకే మాతృప్రేమకు నోచుకోక తండ్రి సంరక్షణలో పెరిగింది. అందువలననే ఆ యింట్లో అక్కయ్యకూ, ఆమె తండ్రికీ గారాల బిడ్డగా తయారయింది. మా స్వగ్రామంలో మా యింటిని ఆనుకొనే వాళ్ళ ఇల్లూ వుంది. నేను అమ్మా నాన్నకూ ఒక్కత్తె అవటంచేత, నాకు తోడు ఎవ్వరూ లేకపోవటంచేత, పార్వతే నా సర్వస్వం అయింది. ఇద్దరం చిన్నతనం నుంచీ కలిసి చదువుకొన్నాం. ఒకళ్ళను విడిచి ఒకళ్ళం ఆడుకోనేందుకు కూడా వెళ్ళే వాళ్ళం కాదు. బాల్యంలోనే మా ఇద్దరిమధ్యా అవ్యక్తమయిన అభిమానం గాఢంగా నాటుకుపోయింది.

పార్వతి ఎల్లప్పుడూ మంచి ఉషారుగా, నవ్వుతూ కేరింతలు కొడతూ వుండేది. కాలేజీల్లో జరిగిన సాంస్కృతికోత్సవాల్లో, నాటకాలలో నాతోపాటు ఆమెకూడా మంచి చొరవ చూపేది. అందరి మధ్యా కులాసాగా కబుర్లు చెప్పేది. పరీక్షల్లో కూడ మంచి మార్కులు తెచ్చుకోవటంచేత ఉపాధ్యాయులలో కూడా ఆమెకు మంచిపేరు వుండేది.

అయితే, ముఖ్యంగా చెప్పాల్సింది ఏమిటంటే; పార్వతికి స్వయంజీవితాన్ని గురించి కొన్ని అభిప్రాయాలువుండేవి. వాటిని అభిప్రాయాలు అనేకంటే ఆశలు అని పేర్కొంటేనే సమంజసంగా వుంటుంది. ఆమెకు అందుబాటులో వుండవని, జరగవని తెలిసినా, వాటిపై ఆశలు పెంచుకొనేది. వివాహం చేసుకున్నా తన స్వాతంత్ర్యానికి భంగం రాకూడదని, ధనికుడైన, అందగాడైన యువకుణ్ని వివాహం చేసుకోవాలని; ఇలాటి ఊహాలతో భవనాలు నిర్మించుకొని ఎల్లప్పుడూ వాటిలోనే విహరించేది. ఈ అభిప్రాయాలన్నీ ఆమెలో గాఢంగా వేళ్లువేసుకొని నాటుకుపోయాయి!

ఈ విషయాలన్నీ "నాకెలా తెలిశాయి" అని మీకు అనుమానం రావొచ్చు! ఈ అభిప్రాయాల్ని నాతో నిర్మొగమాటంగా, బిడియపడకుండా, వెలిబుచ్చేది. ఆమెతో నాకున్న అతిచనువుకూడా, ఆమెను స్నేహితురాలిగానే గుర్తుతెచ్చేది. ఆమె నిప్పలాటి మనిషి! తాను చూపిన చనువును అతిగా పురస్కరించుకొన్న ఒకరిద్దరికి చాలాఘాటుగా సమాధానం

చెప్పటం జరిగింది. అందుకే ఆమె విషయంలో చాలా మందికి భయంకూడా!

స్కూలుఫైనల్ ముగిశాక తన తండ్రి అస్వస్థత, ఆర్థిక పరిస్థితుల వలన చదువు మానేసింది పార్వతి. నేనుకూడా ఆర్థికంగా ఇబ్బందులకు లోనవటంచేత "టీచరు ట్రయినింగు" పూర్తిచేసుకొని మా జిల్లాలోనే ఒక స్కూల్లో ఉద్యోగం సంపాదించుకున్నాను.

నా ఉద్యోగాన్నికూడా మీకు కొంత చెప్పటం సమంజసం! "నా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాక నాలుగేళ్ళు హాయిగా ఒడుదుడుకులు లేకుండా గడిచిపోయాయి. ఆ నా నాలుగేళ్ళలో నేను పరిపూర్ణసుఖాన్ని, తోటివారి ఆప్యాయతను రుచి చూశానంటే గర్వించవలసిన విషయమే!" బ్రతకలేక బండిపంతులనే సామెతను మొదట గుర్తుచేసుకొన్నా; ఆ గ్రామస్థుల ఆదరణలో ఆ విషయాన్ని మరిచిపోయాను. ఆ గ్రామంలో ప్రత్యేక వ్యక్తిగా గౌరవం సంపాదించుకున్నానంటే అందులో నా గొప్పదనం ఏమీ లేదేమో. తత్ఫలితంగా గ్రామంలోని పెద్ద పెద్ద భూస్వాములు ఇళ్ళలో ప్రయివేట్లు చెప్పటం; మొదలైనవారితో ఆర్థికంగాకూడా బాగానే గడిచిపోయింది. ఊరి మునసబు, ప్రెసిడెంటు మొదలైనవారంతా; నాకు జీవితంలో అనుభవం లేకపోయినా, నా మాటకు విలువనిస్తూంటే చెప్పలేని ఆనందం కలిగేది!

కాని నాలుగేళ్ళనుండి మరచిపోయిన పాత రోజులు మళ్ళీ నాకు మరో రూపంలో కన్పించాయి! జీవితనాటక రెండో రంగంలో నేను మళ్ళీ విచిత్ర పరిస్థితుల్లో పార్వతిని కలుసుకున్నాను. ఈ మధ్యకాలంలో క్రమేణా ఆమెను మరచిపోయాను. అప్పుడప్పుడు లీలగా మాత్రమే గుర్తుకొచ్చేది. "ఆమె జీవితం ప్రస్తుతం ఎలావుందో?" అని నేను ఎన్నడూ పనిగట్టుకొని ఆలోచించలేదు. ఆ అవసరం, పరిస్థితులు రాలేదు. స్నేహితురాలిగా భావించాను కనుక, ఆమెను గురించిన స్నేహచిహ్నాలే మనసులో ద్యోతకమయ్యేవి.

* * *

ఒక రోజున ఆ వూరికి కొత్తగా వచ్చిన "ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు" గారి దగ్గరనుంచి నాకు కబురు వచ్చింది. "నాతో పనేమిటా?" అనే ఆశ్చర్యం అణుమాత్రం కలిగినా, దాన్ని లోపలే అణచేశాను. రకరకాలుగా ఆయన్ని మనసులో ఊహించుకొంటూ వెళ్ళాను. ఆయన సాదరంగా నన్ను ఆహ్వానించారు. నేను ఆయన గురించి మనసులో ఊహించినదంతా వేరయింది. ఎవరో నలభై ఏళ్ళ వ్యక్తిగా గంభీర విగ్రహంలా మనస్సులో ఈ కాస్సేపట్లోనే ఊహించుకొన్నా సుమారు పాతికేళ్ళ వ్యక్తిగా ఆయన దర్శనమిచ్చేసరికి నా ఊహాలను నాకే నవ్వొచ్చింది.

నా నమస్కారానికి ప్రతి నమస్కారం చేస్తూ కుర్చీ చూపించాడాయన. ఇంతకీ ఆయన నన్ను పిలిపించిన విషయం ఏమిటంటే "వారి తమ్ముడికి మొదటిఫారంలో ప్రవేశించటానికి ప్రయివేటు చెప్పాలట!" పూర్వం ఆయన పని చేసే వూళ్ళో ఐదవ తరగతి ప్యాసయ్యాడట. ఈ వూళ్లో మొదటి ఫారంలో ప్రవేశపెట్టదల్చుకొన్నాను." అంటూ ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. న్నావద్ద అప్పటికే పదిమంది కుర్రవాళ్ళు ప్రయివేటు చదువుతున్నారు. కాని ఇలా సంఖ్య ఎక్కువయినకొద్దీ ఏదో సామ్యం చెప్పినట్టు మఠానికి చేటుగా తయారవుతుందని భయపడ్డాను.

"ఎలాగయినా వీలుచేసుకొని సాయంత్రం ఒక్కగంట మా యింటికి వచ్చి చెప్పండి" అన్నాడాయన మళ్ళీ.

ఈ విషయం చాలా కష్టమయినది! నా అభిప్రాయాన్ని తేలిగ్గా బయటపెట్టాను. కాని ఆయన పదేపదే వత్తిడిచెయ్యడంతో కాదనలేకపోయేను.

"ఇంక డబ్బు విషయం! మీకు అడ్వాన్సుగానే ఇచ్చేస్తా!" అన్నారు నవ్వుతూ. "ఫరవాలేదులెండి" అన్నాను వినయంగా.

ఆయన ఒకసారి లోపలికివెళ్ళి తిరిగివచ్చి ఏవో విషయాలు ముచ్చటించటం ప్రారంభించాడు. తను క్రితం పని చేసిన ఊళ్ళో జరిగిన సంఘటనలు వినటానికి హాయిగా చెప్తూ కొస్తున్నాడు. ఇంతలో అతడను కాఫీ కప్పులతో ప్రత్యక్ష

మయిన పార్వతిని చూడగానే నా ఆశ్చర్యానికి అవధుల్లేక పోయాయి ఆశ్చర్య కారణం ప్రత్యేకం ఏమీ లేకపోయినా, హఠాత్తుగా ఆమెను చూడటమే!

నుదుట చిన్న కుంకుమ బొట్టు; ముఖం బాగా పీక్కు పోయివుంది. కళ్ళు బాగా లోతుకుపోయాయి. మనిషి బాగా చిక్కి పోయినట్టు స్పష్టపడుతోంది. జీవితంలోని లోతుపాతులు అర్థంచేసుకొని తనలో జీర్ణించుకొన్న లక్షణాలు ముఖంలో కన్పిస్తున్నాయి. మునుపు కన్పించిన హుషారు లీలగానైనా కన్పించటంలేదు నాకేసి అదోలా చూసి వెంటనే తల దించు కొన్న ఆ చూపుల్లో అస్పష్టమైన నిర్వచించలేని అసహాయత బాధ గోచరించాయి! ఆ చూపుతో మనస్సులో ఏదో గుచ్చుకొన్నట్లు ఫీలయ్యాను. నాటి పార్వతికి నేటి పార్వతికి సహస్రాంశం తేడా కన్పిస్తోంది. ముఖంలోని చిలిపితనాన్ని ఆరిందాతనం ఆక్రమించింది.

ఆనాటి పార్వతి!... అవధుల్లేకుండా ముందుకు ఉరుకు తున్న సెలయేరు!...

ఈనాడు... గంభీరముద్రదాల్చిన సముద్రం!...

చూసినది రెండు క్షణాలే అయినా ఆమెలోని మార్పుల్ని ఇట్టే ఆకట్టగలిగాను.

ఆ మార్పులు నాలో ఏదో అవ్యక్తమయిన బాధను రేపినట్టయింది!

ఈ ఆలోచనలతోనే కాఫీ కప్పు అందుకొని త్రాగేశాను.

ఆమె నన్ను గమనించనట్లుగానే తలవంచుకొని లోనికి వెళ్ళిపోయింది.

నన్ను చూసిన తరువాత ఆమె నా గురించి ఏమి ఊహిస్తోందో ఆలోచించలేకపోయాను. కాఫీ త్రాగిన తరువాత మరొక పదినిమిషాలు ఆయనతోనే కాలక్షేపంచేసినా, నా మనస్సు పార్వతిని గురించే ఆలోచిస్తోంది. ఆ ఆలోచనలతోనే ఆయనవద్ద సెలవుతీసుకొని ఇల్లు చేరుకున్నాను.

పార్వతి నాకేసి అదోలా చూచి, తల వంచుకొని, మాట్లాడకుండా ఎందుకు వెళ్ళిపోయిందో నాకర్థం కాలేదు, ఎంతసేపు యోచించినా!

ఆ మరుసటి దినం సాయంత్రం ప్రయివేటు చెప్పటానికి వెళ్ళాను. రవి చాలా చురుకైనవాడే! ఏ విషయమైనా ఒక్కసారి చెప్తే గ్రహించే సామర్థ్యం వుందని నా కర్థమయింది. అతనికి పాఠం చెప్పటంలో నేను ఎక్కువ కష్టపడవలసిన అవుసరం వుండదని గ్రహించగలిగాను.

నాలుగైదు దినాలు గడిచిపోయాయి! రోజూ సాయంకాలం పాఠం చెప్పటం నాదైనందిన కార్యక్రమాల్లో ఒకటయింది! అయితే ఈ ఐదురోజుల్లోను నా మనస్సు సరియైన పరిస్థితిలో లేకపోవటానికి కారణం ఒక్కటే! మళ్ళీ పార్వతి కనుపించకపోవటమే! ఆమెను ఎన్నో విషయాలు అడగాలని,

ఆమెతో చాలా సంగతులు ముచ్చటించాలని మనస్సు ఆత్రపడుతోంది. "మళ్ళీ ఎందుకు కనబడలేదా?" అనేదే బాధగా, సమస్యగా తయారయింది. ఎంతో ఆత్మీయురాలయిన పార్వతి ఇలా ఎందుకు ప్రవర్తిస్తోందో అర్థంకాక, ఏవో పనుల్లో వుండిపోయి వుంటుందని సర్దిపెట్టుకొన్నా!

* * * *

ఆరోజు సాయంత్రం నా సందేహాలన్నీ చాలావరకూ నివృత్తి అయిపోయాయి. పాఠం చెప్పివచ్చేస్తూ వుంటే "మాస్టరూ!" అని విన్పించింది.

అది పార్వతి కంఠం!... సందేహంలేదు!

కాని అది బాల్యదశలో నాకు అప్తురాలైన పార్వతి కంఠంకాదు!

అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా! ఆ పిలుపులో క్రొత్తదనం! మాటలో నమ్రత! కుర్రాడు మాస్టారిని వినయపూర్వకంగా భక్తిప్రపత్తులతో పిల్చినట్లు...!

గొంతులో దీనత్వం... బాధ... అణచుకుందామనుకున్నా పైకి ఉబికివచ్చినాయ్! వెనుదిరిగాను. పార్వతి నేత్రాల్లోని నీటిబిందువులను గుర్తుపట్టడానికి ఎంతో సేపుపట్టలేదు! మనస్సంతా కలచివేసినట్టయింది.

ఏమీ ఆలోచించలేకపోయాను!

కాలి బ్రొటనవేలితో నేలనురాస్తూ చీర చెంగును నోటిదగ్గరపెట్టుకొని నేలను చూస్తూ వుండిపోయింది. తప్పు చేసిన కుర్రవాడు మాస్టారి ఎదుట శిక్ష విధించమని సంజ్ఞ చేస్తూ నిల్చొట్లుంది.

"ఏం పార్వతీ!" ఆప్యాయంగా, అనురాగం ఉట్టిపడే స్వరంతో పలుకరించాను.

"క్షమించండి! మిమ్మల్ని ఇంతవరకూ పలుకరించలేక పోయాను. అవకాశం లేకపోయింది." అంతవరకూ ఆగిన మేఘాలు చిన్నగా వర్షించాయి!

ఆ గొంతులో ఎంత దాచుకుందామనుకున్నా ఆగని దుఃఖం పైకి ఉబికింది. కన్నులనుండి కెంపుల్లాటి అశ్రుకణాలు జారిపడ్డాయి.

"అదేమిటి పార్వతీ మరీ చిన్నపిల్లలాగ! అయినా నాకీ క్రొత్త సంబోధన, మన్నన ఏమిటి?"

"ఏం నువ్వు మాస్టారివి కాదా?" లేని చిరునవ్వు పెదాలపై తెచ్చిపెట్టుకొని ఎదురు ప్రశ్న వేసింది.

నేనుకూడా శ్రుతి కలుపుతూ నవ్వేశాను,

"అయ్యో! నాకు మతేలేదు! ఇంతసేపూ నించోపెట్టి మాట్లాడుతున్నా! ఇలా లోపలికివచ్చి కూర్చో!" అంటూ లోపలికి దారితీసింది.

ఆమెనుంచి చాలా సంగతులు వినాలని ఆత్రంగావుంది.

ఆమెను మౌనంగా అనుసరించాను. లోనికివెళ్ళి కాఫీ కలిపి తీసుకొచ్చి టేబిల్ మీద వుంచింది.

"ఈ మర్యాదలన్నీ ఏమిటి? ఎవరో క్రొత్త వ్యక్తికి చేసినట్లు!"

"ఫరవాలేదు! తీసుకో!" అంది.

కాఫీ త్రాగుతూ అన్నాను. "పార్వతీ! నిన్ను అనుకున్న స్థితిలో చూస్తున్నందుకు చాలా సంతోషంగావుంది. నువ్వు కోరుకున్నట్లు అందమైన, హోదాలోవున్న భర్త లభించాడు. అంతకన్న కావలసిందేముంటుంది? కాని మనిషి మాత్రం. బాగా మారిపోయావు "

"ఏం? ఎలా వున్నాను? అందంగాలేనా?" నైరాశ్యం గూడుకట్టుకొన్న నవ్వుతో అంది.

"అదికాదు! నీ ముఖం, మాటలు, నడవడి చూస్తూ వుంటే ఏదో బాధను లోపలదాచుకున్నట్లుంది! భర్తతో హాయిగా జీవితాన్ని స్వర్గప్రాయం చేసుకోవలసిన ఈ నీ వయస్సులో అంత నిరాశ ఎందుకు ఆవరించిందో అర్థం కావటంలేదు."

"అర్థంకాకపోవటం సహజం! అర్థమయ్యేటట్లు చెప్తా విను! నువ్వు అన్నట్లుగా, నేను అనుకున్నట్లుగా ధనికుడైన, హోదాలో వున్న, అందమైన భర్తే లభించాడు. కాని నిత్య జీవితంలో సుఖాన్ని ఇసుమంతైనా పొందలేక పోతున్నా! నాకీ ఇంట్లో ఏ మాత్రం స్వాతంత్ర్యంలేదు! శాంతిలేదు!

అందరూ ఏదో ఒక వంకపెట్టి నన్ను సాధించేవాళ్ళే. మా అత్తగారు పరమగయ్యాళి. నాకీ ఇంట్లో స్థానం నీచమయి పోయింది. ఇక ఆయనకు తల్లి మాటలు అమృతప్రాయం. ఆమెగారు ఎంతచెప్తె అంత! మా ఆడపడుచు సరేసరి! ఇంకా ఏం చెప్పమటావ్! ఆ బాల్యావస్థ; ఆడుతూపాడుతూ చలాకీగా గడిపినరోజులు, ఆనందాన్ని ఆస్వాదించిన రోజులు జీవితంలో మరిరావు! ఎంత సద్దుకు పోదామనుకున్నా కుదర టంలేదు. జీవితమంతా ఇలాగే గడపాలా!" అని ఆలోచిస్తూ వుంటే మతిపోతున్నట్లుంది!

"ఈ నాలుగురోజుల్లో నీతో మాట్లాడాలని వున్నా ఆ కోరిక చంపుకున్న కారణం తెలుసా! నువ్వు వచ్చిన రోజు ఇంట్లోకి వెళ్ళి నీగురించి చెప్పాను. ఆ మాటలన్ని శ్రద్ధగా విని మా అత్తయ్యగారు ఇంత నోరు చేసుకొని ఏమందో తెలుసా" ఈ కుర్రాడితో నేనా పెళ్ళవక ముందు తిరిగేదానవట? ఇంకేం కావల్సినంత సంబరం! అంటూ నోరు నొక్కుకుంది.

ఇంకా ఏం చెప్పమంటావ్ మధూ! వాళ్ళందరూ ఊరికి వెళ్ళిపోయారు. రవి ఒక్కడే ఉన్నాడు. కనుకనే నీతో మాట్లాడటానికి వీలుచిక్కింది. లేకపోతే ఈ మాత్రం అవకా శంకూడా కలగదు. ఇలాటి హృదయంలేని మమతలు తిరిగిన మనుష్యులమధ్య ఎలా బతకాలో తెలియటంలేదు. ఈ బాధ లన్నీ చెప్పుకుందామన్నా ఎవ్వరూ లేరు. అటునాన్న పరిస్థితి చూస్తే మరీ బాధగా వుంది. ఏదో అలాగే అక్కయ్య చేతి

మీద ఆఖరిరోజులు వెళ్ళబుచ్చుతున్నారు. ఆయనతో ఇవన్నీ చెప్పి ఆయన మనసుకూడా బాధపెట్టటం ఇష్టంలేదు! చెప్పినా ఎవరు చెయ్యగలిగేదీ ఏమీలేదు!

ఇక మా ఆయన పరిస్థితి! బాగా చెయితిరుగుళ్ళకు అలవాటు పడిన మనిషి! మా అత్తయ్యగారు ఆయన్ని సమ ర్థిస్తూ ఇంతవరకూ తీసుకొచ్చారు. నాకు జీవితమంతా ఒక్త చీకటిగా కన్పిస్తోంది. మునపటి పార్వతిని మర్చిపో మధూ! ఆ పార్వతి... చచ్చిపోయింది! ఇక ఆ పార్వతి లేదు! అంటూ కన్నీళ్లు ఒత్తుకొంది.

ఆ మాటలతో ఎవరో నా హృదయంలో చెయ్యిపెట్టి కెలికినట్లయింది. ఇన్నాళ్ళ స్నేహంలో ఆమెలో కన్నీటిని చూసింది ఇదే మొదటసారి! ఆ పరిస్థితిలో ఆమెను ఎలా ఊరడించాలో కూడా అవగాహనకాలేదు! ఆమెకు ధైర్యాన్ని కలుగజేసేకంటే నేను చెయ్యగలిగిందీ ఏమీలేదు. కొంచెం సేపు మౌనంగా ఆలోచించి అన్నాను! "పార్వతీ! ఈ పరిస్థి తిలో నిన్ను ఎలా ఊరడించాలో, ఏమని సమాధాన పరచాలో నాకు అవగాహన కావటంలేదు. మానవుడై పుట్టిన తరువాత జీవితంలో కష్టాలు, అనేక సమస్యలు ఎదుర్కొనేందుకు సిద్ధంగావుండాలి. సుఖాల్లాగే కష్టాలు రావటంకూడా సహజం! ముఖ్యంగా నేటి సంఘంలో స్త్రీ పాత్ర చాలా క్లిష్టమయింది. మరీ అనాగరికం కాకుండా, పూర్తి నాగరికత కాకుండా మధ్యలో పెనుగులాడుతున్న



కథా నిలయం
5292
శ్రీకాకుళం

కాలం ఇది. మనం అనుకున్నట్టు, ఆశలు పెంచుకొన్నట్టు అన్నీ జరుగుతాయనుకొనేది తెలివితక్కువతనం. ప్రతి నిమిషంలోనూ సుఖాన్ని ఊహించుకొనే కంటె కష్టాన్ని ఊహించుకొంటేనే జీవితం తృప్తిగా గడిచిపోతుంది. పరిస్థితులకు అనుగుణంగా నడుచుకొని, సర్దుకొని బ్రతకటం నేర్చుకోవాలి. ఇటువంటి విషమపరీక్షలకు మౌనంగా తలదాల్చి నెగ్గుకురావాలి. ఈ రోజు కాకపోతే రేపైనా మనుష్యులు మారుతారు. కాలం ఒక్కలా వుండిపోదు తమ తప్పుల్ని తెలుసుకొని పశ్చాత్తాపం పొందుతారు. కాని ఓర్పు నేర్చుకోవాలి! ఆశతో ఆ రోజును ఎదురుచూడాలి! ఇంక చెప్పటానికి ఏముంది! వెళ్ళొస్తా!" అంటూ కుర్చీలోంచి లేచాను.

మనస్సు భారంగా వుంది! లోపల అరణ్యాలు ఆక్రోశిస్తున్నట్టనిపించింది.

ఆ రాత్రి పడుక్కున్నానన్న మాటేగాని కంటిమీద కునుకు రాలేదు. ప్రతిక్షణంలోనూ కన్నీరు నింపుకొన్న పార్వతే నా ఎదుట ప్రత్యక్షమవుతోంది. ఆమెను భగవంతుడు సరిగా చూడలేదు. విషమపరీక్ష కల్పించాడు. ఆమె సహనంతో ఈ పరీక్ష నెగ్గుకు రాగలదా! అనేదే నా అనుమానం.

* * *

రోజులు భారంగా దొర్లిపోతున్నాయి! తరువాత

పార్వతి మళ్ళీ నాను రెండుమూడుసార్లు కనిపించింది. కాలక్రమేణా పార్వతి స్థితిగతుల్ని బాగా అర్థంచేసుకోగలి గాను. ఆ నాడు ఆమె చెప్పిన మాటల్ని అనుభవంలో గమ నించాను. ఆమె అత్తగారు నరరూపరాక్షసి! వక్ర అను మానాల పుట్ట! ప్రతి పనినీ వక్రదృష్టితో పరికిస్తుంది. ఎదుటి మనిషిని హీనపరచడం, వాళ్ళు బాధపడుతూవుంటే ఆనందిం చటం, కొంతమందికి "హాబీ"గా ఉంటుంది. పార్వతి ఆడ పడుచు ఈ కోవకు చెందిన మనిషి! ఇక పార్వతి భర్త!– ఇంట్లో మరబొమ్మలాంటివాడు! తల్లి ఎలా ఆడిస్తే అలా ఆడు తాడు. పార్వతి తనజీవితంలో ఏ మాత్రం సుఖపడలేక పోతోంది అంటే అతిశయోక్తి కాదేమో! ఆమె తన బాల్యంలో నిర్మించుకొన్న మేడలన్నీ భ్రమలే అయ్యాయి! కలగా మాత్రం మిగిలిపోయాయి! ఆమె బ్రతుకు దుర్భరంగా, నిస్సారంగా తయారయింది.

ఇంతలో హఠాత్పరిణామం ఒకటి జరిగింది. నాకు తెనాలివద్దనున్న చిన్న పల్లెటూరికి ట్రాన్స్ఫరయింది. ఈ నాలుగున్నరేళ్లూ హాయిగా కాలంగడిపిన ఆ వూరు వదిలి పెట్టాలంటే చాలా బాధకల్గింది! అయినా తప్పనిది! వెళ్ళి పోయే సమయంలో వీలుకల్పించుకొని పార్వతికి కన్పిం చాను. ఎవరో స్వంతమనిషి దూరమైపోతున్నట్టు కన్నీరు నింపుకొంది.

"ఈ దీనురాలిని మరిచిపోకు మధూ! నాకు ఆత్మీయుడిగా మిగిలినవాడివి నువ్వే! అదృష్టం వుంటే ఏ నాడైనా మళ్ళీ చూస్తాను!" అనుకుంటూ లోనికి వెళ్ళిపోయింది. భారంగా బయటకు నడిచాను.

* * *

తెనాలికి దగ్గరలో వున్న ఈ పల్లెటూరువచ్చి సుమారు సంవత్సరమయింది. ఈ మధ్యకాలంలో పార్వతి సంగతులేవి తెలియలేదు! కనీసం యీ మధ్య ఒక్క ఉత్తరమైనా లేదు! నేను వ్రాయటానికి సాహసించినా, దానివలన పార్వతికి కలిగే చెడు ఊహించుకొంటే ఒళ్ళు ఝల్లుమనేది. నేను పార్వతికి ఉత్తరం వ్రాస్తే దాన్ని ఆధారంగా, లేనిపోనివనేకాలు కల్పించి ఆమెను హింసిస్తారు! అది ఆలోచిస్తే భరించలేనిదిగా తయారయింది. కనుక ఆ ప్రసక్తే వదిలేశాను. రోజు రోజుకూ ఆమెను మరిచిపోవటానికే ప్రయత్నిస్తున్నా! ఒక రోజున నా పేర ఒక కవరు వచ్చింది. "ఏమిటోయ్! ఆడవాళ్ళ దస్తూరీలా వుంది! కొంపదీసి ప్రేమలేఖా!" అంటూ నా తోటి టీచరు మాధవరావు ఆ కవరు నాకిచ్చాడు. అది పరిచయమైన దస్తూరీ! కవరు చించాను. అది పార్వతి వ్రాసిన ఉత్తరం! ఆత్రుతగా చదివాను!

మధూ! నన్ను మర్చిపోయి వుంటావనుకుంటా! నన్ను మరోసారి జ్ఞాపకం చెయ్యటానికి, పార్వతి బ్రతికేవుందని

తెలియజేయటానికి ఈ ఉత్తరం వ్రాస్తున్నా, ఈ ఉత్తరంతో నీ శాంతిని పాడుచేస్తున్నానేమో, క్షమించు.

నువ్వు వెళ్ళిపోగానే నాకు ఉన్న ఒక ఆప్తుడూ దూరమయ్యాడు. నాలుగురోజులవరకూ మనిషిని కాలేకపోయాను. నేను అదోలా వుండటం కనిపెట్టిన మా అత్తగారు ఏమందో తెలుసా!? మొగుడు పోయాడని ఏడుస్తున్నావా, ఏడు, నువ్వ అక్కడికే పోయి వాడితో కులుకు! వాడికీ నీకూ సరిపోయింది. అంటూ గోల ప్రారంభించింది.

నేను ఇంక ఆగలేకపోయాను. నా సహనానికి గట్లు తెగిపోయాయి.

ఇంతకాలం నన్ను ఎంత తిట్టినా, కొట్టినా ఓర్చాను. కాని ఏ పాపం తెలియని నిన్ను నా మూలంగా నిందించటం సహించక లేకపోయాను.

"అతన్ని గురించి ఏమన్నా ఒప్పుకోనేది లేదు!" అని నిష్కర్షగా చెప్పేశాను. దాంతో ఆవిడ మరీ రెచ్చిపోయింది.

ఆమెకు నేను ఎప్పుడూ ఎదురు చెప్పలేదు కదూ! ఎదురు తిరిగినందుకు కోపం, ఇద్దరం మాటామాటా అనుకున్నాం. ఆఖరికి అది ఎంత గొడవగా మారిందంటే; ఆ యింట్లో నాకు స్థానం లేదని చెప్పేశారు అందరూ నిష్కర్షగా !...

అప్పటినుంచీ మన స్వగ్రామంలో... శాంతికోసం పరితపిస్తూ... అది లభించటం ఈ జన్మకు జరగదేమో! నాకు

మిగిలిందల్లా ఒక్కటే చింత. నా వలన నీకుకూడా అపనింద తెచ్చాను. నువ్వు జీవితంలో అన్నివిధాల సుఖశాంతులు పొందాలని వాంఛిస్తున్నా!—నీ అప్తురాలు, పార్వతి.” చదవటం ముగించాను.

మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలయినట్టయింది. అరయాలు దహిస్తున్నట్లు బాధ! శరీరమంతా ఉడికిపోతోంది. ఎదురుగా పార్వతి అత్తగారే వుంటే ఏంచేస్తునో!

ఆవిడమీద కోపం, పార్వతిమీద సానుభూతిగా మారిపోయింది.

“ఒకవిధంగా పార్వతి జీవితం నాశనం కావటానికి కారకుణ్ని నేనేమో!” ఈ ఆలోచన రాగానే మెదడు మొద్దుబారిపోయింది.

ఇక ఆలోచించలేకపోయాను!...

నా వలననే అంతా జరిగింది. నేను ఆమె జీవితంలో ప్రవేశించకపోతే ఆమె జీవిత నౌక సుఖంగా సాగిపోయేదేమో, నేను ప్రవేశించి ఆమె జీవితాన్ని ఎడారిచేశాను.”

అవును... నేనే ... ఆమె వినాశానికి కారకుణ్ని నేనే...పిచ్చెత్తినట్టయింది.

వెంటనే శెలవుచీటీ వ్రాసి ఇంటికి చేరుకున్నా, మనసు వివిధరకాలుగా పరుగెత్తుతోంది. శాంతి కరువైంది. మనసు భారంగా వుంది.

వెంటనే ఒక స్థిరనిశ్చయానికి వచ్చా. పార్వతివద్దకు వెళ్ళి నా క్షమార్పణ తెలుపుకొంటేగాని నా బాధ తగ్గదు. పార్వతిని చూడాలని మనసు ఆత్రపడుతోంది:

సాయంత్రం బస్సులో బయలుదేరి మా వూరు వచ్చేశాను. మర్నాడు ఉదయం బయలుదేరి పార్వతి యింటికి వెళ్ళాను.

వీధిలో మడతకుర్చీలో పార్వతి తండ్రి కూర్చుని వున్నాడు.

ముగ్గుబుట్టలా నెరిసిపోయిన ... ఖంగున దగ్గుతూ, మధ్యమధ్య మూలుగుతున్నాడు. నన్ను చూడగానే ముఖమంత చేసుకొని పలుకరించాడు.

పాపం, ఆయన జీవితంకూడా ముళ్ళచాటయింది. రిటైరయినప్పటినుండీ వేరే కాని ఆర్జన ఏమీలేదు. తలనిండా అప్పులు. ఇంట్లో పార్వతి విధవక్కగారు ఉండి ఏదో ఇంత వండిపెడుతూవుంటే కాలక్షేపం చేస్తున్నాడు. ఇప్పుడు పార్వతి కాపురం పాడుచేసుకొని రావటం ఆయనకు ఎంత బాధ కల్గించిందో, నన్ను కూర్చోబెట్టి స్థితిగతులన్నీ చెప్పటం ప్రారంభించాడు. కాని ఆ మాటలు చెవికెక్కటంలేదు. ఆ సంభాషణలో పార్వతిగురించి దొర్లటంలేదు. చివరకు తెగించి అడిగేశాను.

"పార్వతి ఎక్కడ వుంది?"

ఈ ప్రశ్నతో ఆయన ఎంత బాధపడతాడో తెలుసు. కాని ఆమెను త్వరగా చూడాలని మనసు వేధిస్తోంది. ఆమె జీవితం గాజుపాత్రలాటిది. అది నా చెయ్యి తగిలి పగిలి ముక్కలయి భిన్నాభిన్నం అయిపోయింది. ఆమెకు క్షమాపణ చెప్పుకోవాలి. నా ప్రశ్నతో ముసలాయన కన్నీరు నింపు కొన్నాడు.

"లోపల వుంది నాయనా, వెళ్ళు. దాని పరిస్థితి ఏమీ బాగా లేదు."

ఆయన గొంతు బరువుగా వుంది.

మౌనంగా లోపలికి వెళ్ళాను. కుక్కిమంచం మధ్య ఎముకలపోగులాపడి వుంది పార్వతి.

ఆమె కళ్ళలో వెతికినా జీవం కన్పించటంలేదు. నన్ను చూడగానే పొడిగా నవ్వింది.

ఆ నవ్వులో నిర్లిప్తత, దైన్యం, నిస్పృహ అన్నీ ఒక్కుమ్మడిగా తొంగిచూచాయి.

"అసలు ఉత్తరం వ్రాయకూడదనే అనుకున్నాను!" హీనస్వరంతో అంది.

"ఏం, నేను రావటం ఇష్టంలేదా" కొంచెం స్వరం మార్చి అన్నాను.

"ఛా, అదికాదు. ఎందుకు కష్టపెట్టడమని" వచ్చే దగ్గుతెర నాపుకొంటూ అంది.

"ఇప్పటికే నేను చేసిన పాపంతో దహించుకు పోతున్నా, క్షమాపణ చెప్పుకొనే అవకాశం ఈ నాటికి లభించింది. ఆ నాడు నీ జీవితంలో అడుగుపెట్టకపోతే ఏ బాధా వుండేది కాదు. నావలనే నీకీ దుస్థితి కలిగింది."

"ఎవరి ఖర్మకెవరు బాధ్యులు మహా! నా రాత ఇలా వుంది! అంతే." ఉత్తరం వ్రాస్తే వస్తావో రావో అనుకున్నా. ఈ ఆఖరిరోజుల్లో నిన్ను చూడాలన్న కోరిక ఒక్కటే మిగిలిపోయింది—ఇక అదికూడా తీరిపోయింది. "హాయిగా కన్ను మూసెయ్యవచ్చు."

"ఏమిటా మాటలు పార్వతీ?" కాస్త మందలింపు స్వరంతో అన్నాను.

"మాటలు కాదోయ్, మనకున్నది. "రాయల్ డిసీజ్" అంటే రాజాలాంటి రోగం క్షయ, ఒక ఊపిరితిత్తి పూర్తిగా చెడిపోయింది. ఇంకా ఏ ఆశపెట్టుకొని బ్రతకమంటా..." పెద్దదగ్గు తెరవచ్చి మాటల్ని ఆపివేసింది. మనస్సంతా వికలమైపోయింది. భారంగా నిట్టూర్చి బయటకు వచ్చేశాను.